

అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉమాహారతి

ఆంధ్రజ్యోతి, వికారాబాద్, ఏప్రిల్ 16 : ఐఏఎస్ అధికారిణి ఎన్.ఉమాహారతి వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2022-23 బ్యాచ్ సివిల్ సర్వీసెస్‌లో ఆమె అఖిల భారతస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. ఆమె హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం కొనసాగించగా, ఐఐటీ హైదరాబాద్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తరువాత ఆమె సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యారు. ఆమె స్వస్థలం సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్. ఉమాహారతి తండ్రి ఎన్.వెంకటేశ్వర్లు నారాయణపేట జిల్లా ఎస్పీగా పని చేసిన విషయం తెలిసిందే. శిక్షణ పూర్తి చేసుకున్న ఉమాహారతికి అసిస్టెంట్ కలెక్టర్‌గా వికారాబాద్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే ఆమె కలెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ధాన్యంకొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టర్ నారాయణ రెడ్డి నిర్వహించిన సమీక్షాసమావేశంలో పాల్గొన్నారు.

కొమ్మ కొమ్మకో కొంగ




ఎక్కడెక్కడో పనులు చేసుకుని జనాలంతా ఇళ్లకు చేరినట్లు.. పక్షులు సైతం తిండి కోసం ఎక్కడికో వెళ్లి చీకటి పడుతుందంటే అవన్నీ గూటికి చేరుతాయి. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. వేల సంఖ్యలో అక్కడ కొంగలు ఆవాసం ఏర్పచుకున్నాయి. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ సరిహద్దు. సీపీఆర్ఐ వద్ద గల చెరువు నుంచి చూస్తే కనుచూపు మేర వేలాది కొంగలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి పక్కన చీకటి పడిందంటే చాలు ఇది పూల వనమా అన్నట్లు.. చెట్ల నిండా తెల్ల కొంగలు కూర్చొని ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

- ఘట్‌కేసర్, ఏప్రిల్ 16

నామినేషన్లకు వేళాయె!

రేపే లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్

- నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం!
- ఏర్పాట్లలో నిమగ్నమైన యంత్రాంగం
- రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ ఆర్వో ఆఫీస్
- మేడ్చల్ కలెక్టరేట్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంటు ఆర్వో కార్యాలయం ఏర్పాటు



లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టం రేపు ప్రారంభం కాబోతోంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ పర్వం మొదలు కానుంది. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు సమర్పించేందుకు గడువు ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థులు అంతకు ముందే మంచి ముహూర్తం చూసుకుని దాఖలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. కాగా , నామినేషన్ల ఘట్టాన్ని ఎవరికి వారు అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ ముఖ్యనేతలను ఆహ్వానించి వారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలని అభ్యర్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలోనే..

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లు స్వీకరణ కార్యక్రమం రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో జరగనుంది. వాస్తవానికి చేవెళ్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కొత్తగా నిర్మించిన కలెక్టరేట్ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంది. ఈ అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉండడంతో విచిత్ర పరిస్థితి ఏర్పడింది. దీంతో చేవెళ్ల పార్లమెంట్ ఆర్వో కార్యాలయాన్ని రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అన్ని సమీక్షలు, మీడియా సమావేశాలు ఇక్కడ నుంచే నిర్వహిస్తున్నారు. ఇక మేడ్చల్ మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి శామీర్‌పేట్ సమీపంలోని కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు.


ఆంధ్రజ్యోతి, వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 16 : సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్న లోక్‌సభ ఎన్నికల ప్రధాన ఘట్టం రేపు ప్రారంభం కాబోతోంది. చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాలకు మే 13వ తేదీన ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. రంగారెడ్డి ఉమ్మడి జిల్లా పరిధిలో చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. సెలవు రోజు ఆదివారం మినహా మిగతా అన్ని రోజుల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్‌పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

రెండు చోట్ల నామినేషన్ల స్వీకరణ

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. చేవెళ్ల, మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్లను రిటర్నింగ్ అధికారులు జారీ చేస్తారు. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్ల స్వీకరణకు ఏప్రిల్ 25వ తేదీ చివరి తేదీగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. 26న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్ల ఉప సంహరించుకునేందుకు 29వ తేదీ వరకు గడువు ఉంది. నామినేషన్ల గడువు ముగిసిన వెంటనే తుది పోటీల్లో ఎంత మంది అభ్యర్థులు ఉన్నారనేది స్పష్టత రానుంది. మే 13న పోలింగ్ జరగనుండగా, జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.

మంచి ముహూర్త బలం చూసుకుని ..

ఇదిలా ఉంటే, మంచి ముహూర్త బలం చూసుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ఖరారైన విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి ఎన్నికల బరిలోకి దిగిన విషయం తెలిసిందే. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ పర్వం ప్రారంభం కానుండగా, 19, 21, 22, 24వ తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. 21వ తేదీ ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు దాఖలు చేయడానికి, స్వీకరించడానికి అవకాశం లేదు. 19, 22, 24వ తేదీల్లో ఎక్కువ నామినేషన్లు అందజేసేందుకు అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఆరోజుల్లో అభ్యర్థులు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. చివరి రోజు తమ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీలతో మరో సెట్ నామినేషన్ దాఖలు చేయాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. నామినేషన్ల ఘట్టాన్ని ఎవరికి వారు అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నేతలను ఆహ్వానించి వారి సమక్షంలో నామినేషన్లు దాఖలు చేయాలని వారు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే.



కోడ్ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

- మీడియా సమాశంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక



ఎన్నికల కోడ్ ఉల్లంఘించే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియపై మంగళవారం రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో నిర్వహించిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే సీ-విజిల్ యాప్‌ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచిందన్నారు. ఎన్నికల నియమావళి అమలు తీరు పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో ఇంటెలిజెన్స్ కమిటీని నెలకొల్పనున్నట్లు చెప్పారు.

రూ.2.61 లక్షల నగదు సీజ్

ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో రూ.2.61 లక్షల నగదు, రూ.4.18 లక్షల విలువ గల వెండి, 1.28 లక్షల విలువ గల ఫ్యాబ్రీస్, 69.51 లక్షల విలువగల మద్యం, 3.28 లక్షల విలువ గల డ్రగ్స్/నార్కొటిక్ సీజ్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

చేవెళ్ల పార్లమెంటు పరిధిలో 29,28,186 ఓటర్లు

చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గం కింద చేవెళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయని తెలిపారు. ఏడు నియోజకవర్గాలలో 29,28,186 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 2,824 పోలింగ్ కేంద్రాలు, 53 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 13,443 పీవోలకు ఏపీవో, ఓపీవోలు ఉన్నారన్నారు. 259 సెక్టోరల్ అధికారులు ఉన్నారని ఒక్కో సెక్టోరల్ అధికారి 11 పోలింగ్ కేంద్రాలు పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉన్న దగ్గరే రిసెప్షన్ సెంటర్ కూడా ఉంటుందని తెలిపారు.

ఎన్నికల నోటిఫికేషన్	ఏప్రిల్ 18
నామినేషన్ల స్వీకరణ	ఏప్రిల్ 18
నామినేషన్లకు చివరి గడువు	ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన	ఏప్రిల్ 26
ఉపసంహరణకు గడువు	ఏప్రిల్ 29
పోలింగ్	మే 13
ఓట్ల లెక్కింపు	జూన్ 4

బీఎస్ఐటీలో కౌంటింగ్ సెంటర్..

కౌంటింగ్ కేంద్రం చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ టెక్నాలజీ నందు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్ వద్ద స్ట్రాంగ్ రూమ్స్ కూడా ఉందని, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద బారీకేడ్లు, సివిల్ పనులు, కావలసిన వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలీసు బలగాలతో పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. పరిస్థితులను బట్టి పోలింగ్ నాటికి వీటి సంఖ్య మారే అవకాశాలు ఉంటాయన్నారు. ఎఆర్‌వోలు జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుంది అని అన్నారు.



గుండ్లపోచంపల్లిలోని ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న అధికారులు

అనుమతులు లేని ఆస్పత్రుల సీజ్

- మేడ్చల్ జిల్లా వైద్యశాఖ అధికారుల తనిఖీ..

ఆంధ్రజ్యోతి, మేడ్చల్ ఏప్రిల్ 16 : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, ల్యాబ్‌లపై జిల్లా వైద్య శాఖ అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే క్లినిక్‌లను అధికారులు సీజ్ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా క్లినిక్‌లను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా, మోతాదుకు మించి, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన యాంటీబయోటిక్ మెడిసిన్‌ను ఇవ్వడం, బెడ్స్ ఏర్పాటు చేసుకుని ట్రీట్‌మెంట్ ఇవ్వడం వంటి వాటిని గుర్తిస్తూ నోటీసులు జారీ చేస్తున్నారు. తాజాగా మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లో అల్లోపతి వైద్యం చేస్తూ మందులు రాస్తున్న మేఘావత్ కవితకు చెందిన ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆమెపై సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు ఫిర్యాదు చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి రఘునాథ స్వామి తెలిపారు. అర్హత లేకున్నా అల్లోపతి మందులను ఇస్తుండడంతో తనిఖీ చేసి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ వైద్యాధికారి నారాయణరావు, వైద్యులు లావణ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10,342

కొత్త ఓటరు దరఖాస్తులు

- ఓటరు నమోదుకు 9,332.. చిరునామా మార్పునకు 1,010 అప్లికేషన్లు
- 25వ తేదీలోగా పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశం



ఆంధ్రజ్యోతి, వికారాబాద్, ఏప్రిల్ 16 : లోక్‌సభ ఎన్నికలు పురస్కరించుకుని నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో జిల్లాలో 10,342 దరఖాస్తులు వచ్చాయి. గత జనవరి 23 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు జిల్లాలో కొనసాగిన కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమంలో మొత్తం 10,342 దరఖాస్తులు రాగా, వాటిలో కొత్త ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులు 9,332 ఉండగా, చిరునామా మార్పులకు సంబంధించి 1,010 దరఖాస్తులు ఉన్నాయి. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి అత్యధికంగా తాండూరు నియోజకవర్గంలో 2,698 దరఖాస్తులు రాగా, కొడంగల్ నియోజకవర్గంలో 2,401, పరిగి నియోజకవర్గంలో 2,392, వికారాబాద్ నియోజకవర్గంలో 1,841 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు కోసం వచ్చిన ఫారం-6 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,233 దరఖాస్తులను ఆమోదించగా, 926 దరఖాస్తులను తిరస్కరించారు. 1173 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అదే చిరునామా మార్పు కోసం వచ్చిన ఫారం-8 దరఖాస్తుల్లో 861 దరఖాస్తులను ఆమోదించగా, 63 దరఖాస్తులను తిరస్కరించారు. 86 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మొత్తం దరఖాస్తుల్లో 8094 దరఖాస్తులను ఆమోదించగా, 989 దరఖాస్తులను తిరస్కరించారు. 1259 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు.

నియోజకవర్గాల వారీగా ...

ఓటరు నమోదు కోసం పరిగి నియోజకవర్గంలో 2392 దరఖాస్తులు రాగా, వాటిలో ఇప్పటి వరకు 2035 దరఖాస్తులు ఆమోదించగా, 92 దరఖాస్తులను తిరస్కరించారు. 265 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ నియోజకవర్గంలో 1841 దరఖాస్తులు రాగా, వాటిలో 1173 దరఖాస్తులను ఆమోదించగా, 297 దరఖాస్తులను తిరస్కరించగా, 371 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. తాండూరు నియోజకవర్గంలో 2698 దరఖాస్తులు రాగా, వాటిలో 2376 దరఖాస్తులను ఆమోదించగా, 40దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 282 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో 2401 దరఖాస్తులు రాగా, వాటిలో 1649 దరఖాస్తులను ఆమోదించగా, 497 దరఖాస్తులను తిరస్కరించారు. 255 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయనున్నారు. అదే ఫారం-8 దరఖాస్తులు మొత్తం 1,010రాగా వాటిలో 861 దరఖాస్తులను ఆమోదించగా, 63దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 86 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.



దమ్మాయిగూడ మున్సిపాలిటీ ప్రజాసాయి గార్డెన్‌లో అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీరామ నవమి వేడుకలకు సర్వం సిద్ధం

కీసర, ఏప్రిల్ 16 : శ్రీరామ నవమి వేడుకలకు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో రాములోరి ఆలయాలు ముస్తాబయ్యాయి. దేవాలయాలు, పురప్రధానవీధుల్లో సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు, కల్యాణ మండపం, ఆలయాలకు విద్యుత్ దీపాలను అమర్చారు. వేడుకలకు విచ్చేసే భక్తులకు వసతులు కల్పించారు. అన్న ప్రసాద వితరణ నిర్వహించేదుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దమ్మాయిగూడ మున్సిపల్‌పరిధి ప్రజాసాయిగార్డెన్ లోని త్రిమూర్త్యాత్మక దేవాలయం, నాగారంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, సత్యనారాయణ కాలనీ లోని రమాశ్రీసత్యనారాయణ స్వామి ఆలయాల్లో వేడుకలను వేద పండితుల సమక్షంలో, నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రమాశ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారంఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు.



విద్యుత్ వెలుగుల్లో కొడంగల్ మండలం టెక్కోల్‌లోని ఆంజనేయస్వామి ఆలయం

ఎమర్జింగ్ టెక్నాలజీపై పట్టు సాధించాలి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 16: కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు ఎమర్జింగ్ టెక్నాలజీపై పట్టు సాధించాలని హైదరాబాద్ జేఎన్టీయూ సీఈసీ హెచ్ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ కేపీ సుప్రీతి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 'నేషనల్ కాన్ఫరెన్స్ ఇన్ ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్' పేరుతో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ కేపీ సుప్రీతి మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగంలో దూసుకుపోవాలంటే నేడు ఇంజినీరింగ్ సీఎస్ఈ విభాగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్ నేరాల నియంత్రణకు ఈకోర్సు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కోర్సులో ఆవిష్కరిస్తున్న కొత్త విధానాలను విద్యార్థులకు బోధించడానికి అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. మానవ మేధస్సుకు చిక్కని సాంకేతికతను ప్రపంచానికి అందజేయాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి. కార్యదర్శి జె.త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ ఏ.మోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ లోకనాథం, డీన్ రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ కేపీ సుప్రీతి

100ఫీట్ల ఎత్తులో జాతీయ జెండా

● తాండూరులో మున్సిపాలిటీలో ఏర్పాట్లు
● రూ.25లక్షల కేటాయింపు ● ఆగస్టులో ఆవిష్కరణ

తాండూరు, ఏప్రిల్ 16: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఏ మున్సిపాలిటీలో లేనివిధంగా తాండూరు మున్సిపాలిటీలో 100ఫీట్ల ఎత్తులో జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జాతీయ జెండాకు అవసరమైన జెండా దిమ్మె, పోల్ ఏర్పాటు పూర్తయింది. ఈజెండా ఏర్పాటుతో తాండూరు పట్టణానికి కొత్తశోభ సంతరించుకోనుంది. 100ఫీట్ల (30మీటర్ల) ఎత్తుజెండా, అదనంగా పైభాగంలో 5ఫీట్లతో విద్యుత్ లైటును ఏర్పాటు చేయనున్నారు. ఆగస్టు 15వ తేదీన ఈ ఎత్తైన జెండాను ఆవిష్కరించనున్నారు. గత జనవరిలో ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ సమయం తక్కువగా ఉండటంతో సాధ్యం కాలేదని అధికారులు చెబుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఇంత పెద్దఎత్తున జెండాను ఏర్పాటు చేస్తున్న తొలి మున్సిపాలిటీ తాండూరు కావడం విశేషం. ఈజెండా ఏర్పాటుకు రూ.25లక్షలను పట్టణ ప్రగతినిధులను కేటాయించారు. కాంట్రాక్టర్ మూడు, నాలుగు రోజులుగా ఈ పనిలో నిమగ్నమయ్యారు. తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ ప్రత్యేకచొరవతో ఈ ఎత్తైన జెండాను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. శాశ్వతంగా ఉండే విధంగా ఈ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. ఫౌండేషన్, గ్రానైట్, లైటింగ్, 30మీటర్ల (100ఫీట్ల) పోల్ ఏర్పాటు పూర్తయింది. మున్సిపల్ ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుస్సేన్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.



జెండా ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన పోల్



జెండా పోల్‌కు పైభాగంలో అమర్చబడిన విద్యుత్ లైటు


సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో రోజా

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కడ్తాల్, ఏప్రిల్ 16 : మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషిచేయాలని ఆమనగల్లు సీడీపీవో రోజా అన్నారు. దీనిపై అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కడ్తాల్ రైతు వేదికలో మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మానవ అక్రమ రవాణా నిర్మూలన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు రోజులు జరిగే కార్యక్రమానికి సీడీపీవో హాజరయ్యారు. కరపత్రాలు, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. రోజా మాట్లాడుతూ వయస్సు, లింగ భేదం లేకుండా స్వలాభం కోసం కొందరు మానవులను అక్రమ రవాణా చేస్తుండడం అమానుషమన్నారు. 'ప్రజ్వల' మేనేజర్ బాలరామకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థ 28ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పోరాడుతూ 28,500 మంది మహిళలను కాపాడిందన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రాయదుర్గంలో బీజేపీ ఎన్నికల ప్రచారం

రాయదుర్గం, ఏప్రిల్16 : గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలో చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా డివిజన్ అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు నీలం నరేందర్‌కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు నరేందర్ గౌడ్, సురేష్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, దయాకర్‌ముదిరాజ్, అశోక్‌కుమార్ ముదిరాజ్‌తో పాటు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై పునఃసమీక్షించాలి

▸ దక్షిణ మధ్య రైల్వే జీఎంకు విశ్వేశ్వర్‌రెడ్డి లేఖ

తాండూరు, ఏప్రిల్ 16: చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని పాత తాండూరులో దక్షిణ మధ్య రైల్వే నిర్మించతలపెట్టిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులపై అధికారులు పునఃసమీక్షించాలని, ప్రజాభీష్టం మేరకే పనులు చేపట్టాలని మాజీ ఎంపీ, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్‌లకు మంగళవారం వేర్వేరుగా ఈ విషయంపై లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనిర్మాణం కారణంగా నిర్వాసితులవుతున్న బాధితుల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్తి నష్టం ఎక్కువ జరుగుతుందని, ఈ నిర్మాణానికి అత్యధికంగా వ్యయం అయ్యేందుకు అవకాశం ఉన్నందున తక్కువ వ్యయంతో, తక్కువ ఆస్తి నష్టంతో రైల్వే అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. స్థానికంగా ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండానే ఆగమేఘాలపై నిర్మాణం చేపట్టడమమేంటని ప్రశ్నించారు. ఈ నిర్మాణం వల్ల పేద, మధ్యతరగతి, దిగువ తరగతి ప్రజలు, ఇళ్లస్థలాలను, ఆస్తులను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడినందున పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వేస్టేషన్‌లో ట్రైన్ నంబర్ 17319, 17320 హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, ట్రైన్ నంబర్ 12793 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బషీరాబాద్‌లో హాల్ట్‌కు అనుమతించాలని రైల్వే జీఎంకు పంపిన లేఖలో పేర్కొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

యాచారం, ఏప్రిల్ 16 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదామని భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. భువనగిరి ఎంపీ కోమటి రెడ్డి వెంకటరెడ్డి సొంత గ్రామంలో ఉదయ సముద్రం, దేవాదుల ప్రాజెక్టుల కాలువలను ఇప్పటివరకూ పూర్తి చేయలేకపోయారని, ఇరిగేషన్ ప్రాజెక్టు కాలువల పనులను గాలికొదిలేశారని అన్నారు. మంగళవారం యాచారం మండలంలోని గున్‌గల్ గ్రామంలో సీపీఎం మండల కార్యకర్తల విస్తృస్థాయి సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల విధానాల కారణంగా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల కారణంగా పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు ఇవ్వలేకపోయిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిచేసి ఉంటే నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు తాగునీరు అందేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాదయ్య, సీపీఎం మండల కార్యదర్శి నర్సింహా, నాయకులు తదితరులున్నారు.


మాట్లాడుతున్న సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు

▸ వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఈవీఎం స్ట్రాంగ్ రూంలను తహసీల్దార్ బి.విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు, సిబ్బందికి భోజన సదుపాయం, వాహనాల పార్కింగ్‌ల ఏర్పాట్లపై కళాశాల చుట్టూ తిరిగి పరిశీలించారు. స్ట్రాంగ్ రూం చుట్టుపక్కల ప్రాంతాలను, ప్రధాన మార్గాలను పరిశీలించి రక్షణపరంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూం దగ్గర తనిఖీచేసి 24గంటల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక అధికారులు స్ట్రాంగ్ రూంలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూం దగ్గర కేంద్ర సాయుధ బలగాలతో మాట్లాడుతున్న లింగ్యానాయక్

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ

▸ కలెక్టర్ నారాయణరెడ్డి

పరిగి, ఏప్రిల్ 16: జిల్లాలో రైతులకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పరిగిలోని డీసీఎమ్మెఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజనకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. వరి పంటకు కనీస మద్దతు ధర క్వింటాలుకు ఏ గ్రేడ్ రకం రూ.2203, సాధారణ రకానికి రూ.2183లు చెల్లిస్తున్నటు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో కావాల్సిన వసతులతోపాటు, తూకం మిషన్‌లు, టార్పాలిన్స్, గన్నీబ్యాగులు, తేమ మిటర్స్, ప్యాడి క్లీనర్స్, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాల కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పరిగి మినీ స్టేడియంలోని ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్దకు 24 గంటలు భద్రత ఉండాలని సూచించారు. అంతేకాకుడా నస్కల్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నీటి సరఫరా, సమస్య ల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహరిత, డిపీవో గోపాల్, ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్‌వో రాజేశ్వర్, తహశీల్దార్ ఆనంద్‌రావు, డీసీఎంఎస్ డీఎం శ్యాంసుందర్‌రెడ్డి, ఏడిఏ లక్ష్మీకుమారి, ఏవో ప్రభాకర్‌రెడ్డి, డీసీఎమ్మెఎస్ పరిగి మేనేజర్ డి.వెంకటయ్యసంతోష్ తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నారాయణరెడ్డి

ఓటరు నమోదు పెండింగ్ ఫారాలు పూర్తి చేయాలి

ఓటరు జాబితా నమోదులో పెండింగ్ ఫారాలు అన్ని ఈ నెల 25 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను తప్పులు లేని జాబితాగా రూపొందించాలన్నారు. అదే విధంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులు పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ బృందానికి టెలిక్నాపరెన్స్ ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి పెట్టాలి

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న 16 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కారణాలను తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. బెల్ట్ షాపులను గుర్తించి వెంటనే తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లపైన నూర్పిల్లు (కల్లాలు) చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ లాల్ సింగ్, పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్, డిఎంహెచ్‌వో పల్వాన్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఇంజనీర్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆమనగల్లు, ఏప్రిల్ 16: హామీల అమలులో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎర్రవోలు శ్రీను ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరిట ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామంలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీను ఇంటింటికీ తిరిగి బీజేపీ పదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మరోమారు బీజేపీని ఆదరించి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేవైఎం నాయకులు రాఘవేందర్, శివ, మహేశ్, పి.శివ, ఈదమయ్య వెంకటయ్య, తదితరులున్నారు. అదే విదంగా తలకొండపల్లి మండల కేంద్రంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నాయకుడు శానమోని పాండు, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్‌లు యాదయ్య, తదితరులున్నారు.


ప్రచారంలో చేస్తున్న బీజేపీ నాయకులు

అవినీతిని నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా

▸ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 16: ఐదేళ్ల తన ఎంపీ పాలనలో ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే తాను పోటీ నుంచి తప్పుకుంటానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సవాల్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తనపై గెలవలేక కొంతమంది ఎంపీ అభ్యర్థులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దాణా స్కాం, అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లకాంట్రాక్టుతో పాటు ఆలయాలను కూల్చివేయించామని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎవరైనా నిరూపిస్తే తాను పోటీనుంచి తప్పుకుంటానన్నారు. ఎంపీగా తనను గెలిపిస్తే వికారాబాద్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎలా పనిచేశాననో, ఇప్పటి నుంచి కాంగ్రెస్‌లో అదే తరహాలో అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.


మర్పల్లి : మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

కోట్లాది రూపాయలు మంజూరు చేయించా : స్పీకర్

నియోజకవర్గ అభివృద్ధికి తాను కోట్లాది రూపాయలు మంజూరు చేయించానని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తాను గెలిచిన మూడునెలల్లోపు ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్లు, చెరువులు, ప్రాజెక్టుల మరమ్మతులకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే వికారాబాద్ జిల్లాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, తాను సన్నిహితులమని, నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా మంజూరు చేయించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు వసంతం, శివకుమార్ గుప్తా, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా నాయకులున్నారు.

సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

శంషాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు పథకాలను వివరించి లోక్‌సభ ఎన్నికల్లో ఓటువేసేలా మద్దతు కోరాలని రంజిత్‌రెడ్డి అన్నారు. పెద్దషాపూర్‌లోని ఎస్వీరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మండల మహిళా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విశ్వేశ్వర్‌రెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేయడం దారుణమన్నారు. పార్టీ ఇన్‌చార్జి నరేందర్, మాజీ ఎంపీపీ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్‌ముదిరాజ్, తదితరులున్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలి

చేవెళ్ల : చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని రంజిత్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండలంలోని దామరగిద్ద, ఊరెళ్ల, సింగప్పగూడ మాజీ సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, జహంగీర్, రహీమాబేగం, సీనియర్ నాయకులు అలీ తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. సీనియర్ నాయకులు వసంతం, శివకుమార్ గుప్తా, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌గుప్తా నాయకులున్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

షాబాద్/మహేశ్వరం : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పామెన భీంభరత్ అన్నారు. షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు. కాగా, కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. మంగళవారం రాత్రి తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో తుక్కుగూడలో కాంగ్రెస్‌లో చేరారు. కేఎల్లార్ మాట్లడుతూ రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు దేవ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

మియాపూర్/చందానగర్/పహాడిషరీఫ్/ఎల్‌బీనగర్ : హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీతారెడ్డి అన్నారు. హఫీజ్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ పూజిత, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ఎంటీసీ డెవలప్‌మెంట్ చైర్మన్ జైపాల్ రంజిత్‌రెడ్డికి మద్దతుగా చందానగర్‌లో ప్రచారం నిర్వహించారు. పహాడిషరీఫ్‌లోని మల్లాపూర్‌లో వైఏఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన జల్‌పల్లి మున్సిపాలిటీ బూత్‌స్థాయిలో రంజిత్‌రెడ్డికి భారీ మెజార్టీ వచ్చేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పీసీసీ కార్యదర్శి ఎలిమేటి అమరేందర్‌రెడ్డి సూచించారు. ఇన్‌చార్జి నిజాముద్దీన్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం సీనియర్ నాయకుడు నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా తీగల పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



బొంరాస్‌పేట్: సీతారాముల ఎదుర్కోళ్లలో మంగళహారతులతో మహిళలు



కీసర రూరల్: ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

తాండూరు, ఏప్రిల్ 16: తాండూరులో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ కల్యాణాన్ని నిర్వహించే ందుకు ఆలయ నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేముస్తాబు చేయడంతో పాటు కల్యాణ మండపాలను సిద్ధం చేశారు. తాండూరులోని రైల్వే స్టేషన్ హనుమాన్, ఇంద్రానగర్‌లోని రామమందిర్, ఆదర్శ తులసీనగర్ కాలనీలోని వరహ సిద్ధివినాయక మందిరం, పాత తాండూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో రాముల వారి పెళ్లి శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలో మాంస విక్రయాలు చేపట్టరాదని, చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ మటన్, చికెన్, బీఫ్ మాంసం వ్యాపారులకు , హోటళ్లు, రెస్టారెంట్‌లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

కులకచర్ల: కులకచర్ల మండల కేంద్రంతో పాటు మండలంలోని ముజాహిద్‌పూర్, తిరుమలాపూర్ గ్రామాల్లో హనుమాన్ ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. బుధవారం జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11:45 గంటల నుంచి 12:45గంటల వరకు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో చలువ పందిళ్ల వేసి రంగురంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఎదులాబాద్ రామాలయం, ఘణాపూర్‌లోని శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయం, అంకుషాపూర్‌లోని రామాలయం, కాచవానిసింగారం, ప్రతాప్‌సింగారం, కొర్రెముల, వెంకటాపూర్ గ్రామాల్లోని రామాలయాలను ముస్తాబుచేశారు. కల్యాణ మండపాలను సుదరంగా అలంకరించారు. శ్రీరామనవమి సందర్భంగా జరిగే శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలో మంగళవారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను భూలక్ష్మమ్మ చౌరస్తా నుంచి కల్యాణ ఉత్సవ ప్రాంతానికి తీసుకెళ్లారు. సాయంత్రం వేళలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సీతారాముల విగ్రహాలతో పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీ సేవలో భజనలతో భక్త సమాజం ఆవరణ వరకు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జయమ్మ, చెన్నమ్మ, గ్రామ నాయకులు నర్సిములుగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ఘణాపూర్‌లో ముస్తాబైన శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం



కులకచర్ల: ముస్తాబైన ముజాహిద్‌పూర్ హనుమాన్ ఆలయం

రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న యువకులు

పరిగి, ఏప్రిల్ 16: రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడాలని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పరిగిలోని ఏటీఎస్ ప్లాజాలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 233 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి, కొడంగల్ సీఐలు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐలు సంతోష్, మధుసూదన్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, ఆనంద్, భరత్‌రెడ్డి, రవూఫ్, శ్రీశైలం, పరిగి మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, బీజేపీ తాలూకా ఇన్‌చార్జి మారుతీకిరణ్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పరిగి మహిళలు

పరిగి, ఏప్రిల్ 16: తిరుమల తిరుపతిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పరిగి మహిళలు సేవలందిస్తున్నారు. పరిగి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన గంట అంజమ్మ ఆధ్వర్యంలో తొమ్మిది మంది మహిళలు అంజమ్మ, గీత, ఉమారాణి, మంగ, ఉమాదేవి, లత, లలిత, సుధ, శారదల బృందం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యేవరకు సేవలు అందిస్తామని తెలిపారు.

పాఠశాలలో వసతుల కల్పనకు చర్యలు

తాండూరు, ఏప్రిల్ 16: తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలలను మంగళవారం మున్సిపల్ అధికారులు సందర్శించి వివరాలను సేకరించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 27ఉన్నాయి. పాఠశాలలన్నింటినీ మున్సిపల్ యంత్రాంగం సందర్శించి కనీస వసతులైన తాగునీటి సౌకర్యం, మైనర్ రిపేర్స్, మేజర్ రిపేర్స్, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలపై అధికారులు సర్వే చేపట్టారు. పాఠశాలలో ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేసిన పనుల వివరాలను అధికారులు సేకరించారు. 11 మంది అధికారులను నియమించారు. సర్వేకార్యక్ర మంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ బి.రమేష్, అధికారులు ఉమేష్ కుమార్, ఎం.యాదగిరి, సి. ఆంజనేయులు, కె. శ్రీనివాస్, ఎం. అనంతయ్య, నాగరాజ్, నీరటి శ్రీనివాసులు ఉన్నారు. సమగ్ర రిపోర్టులు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



హెచ్ఎం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

కొడంగల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని కొడంగల్ మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించి తాగునీరు, విద్యుత్ సమస్యల గురించి గ్రామస్థులతో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మురారి వశిష్ఠ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్, కో ఆప్షన్ సభ్యుడు మునీర్ పాల్గొన్నారు.



హరితహారం

మొక్కలు ఎండుముఖం



బండవెల్కిచర్ల దారిలో వాడిపోయిన మొక్కలు

కులకచర్ల, ఏప్రిల్ 16: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రస్తుతం నీటి సదుపాయం లేకపోవడంతో అవి వాడిపోతున్నాయి. కులకచర్ల నుంచి బండవెల్కిచర్ల దారికి రెండు వైపులా గతంలో హరితహారంలో వివిధ రకాల మొక్కలు నాటారు. ప్రస్తుతం విపరీతమైన ఎండలతో నీటి ఎద్దడి అధికమైంది. రోడ్డుపక్కన ఉన్న మొక్కలకు నీరు లభించకపోవడంతో ఎండుతున్నాయి. గతంలో సర్పంచ్‌లు పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా మొక్కలకు నీరు అందించేవారు. ఇప్పుడున్న ప్రత్యేకాధికారులు ఏ చర్యలు చేపట్టకపోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామగ్రి

తాండూరు రూరల్, ఏప్రిల్ 16: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సామగ్రి తాండూరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. పోలింగ్‌కు సంబంధించి స్టేషనరీ, బ్యాగులు, పింక్ బ్యాటిల్స్ వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎన్నికల పోలింగ్ సమయంలో ఎన్నికల సిబ్బందికి అందజేస్తామని చెప్పారు.



ఎన్నికల సామగ్రిని చూపుతున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాలు సిద్ధం

కులకచర: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 47పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 32గ్రామపంచాయతీలు, రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 36,276మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 18,315 మహిళలు, 17, 315 ఉండగా నలుగురు ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నట్లు తెలిపారు. ముజాహిద్‌పూర్‌లో ఇద్దరు, పుట్టపహాడ్, అనంతసాగర్‌లో ఒక్కొక్కరు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కోసం 47 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు 80 మంది ఉన్నారని, దివ్యాంగులు 832 మంది ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు.

ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 16: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పల్లేరు బిక్షపతి మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తన కూతురును చూడడానికి ములుగు వెళ్లి తిరిగి తన గ్రామానికి వస్తున్న క్రమంలో మజీద్‌పూర్‌లోని వేంకటేశ్వర గుట్ట వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన రెండిళ్లలో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 16: తాళం వేసిన రెండిళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ శ్రీ సాయి నగర్ కాలనీకి చెందిన ముత్యాల మహేష్ ఈనెల 13వ తేదీన బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఇంటి చుట్టుపక్కల వారు ఇంటి తాళం పగులగొట్టి ఉందని మహేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలో భద్రపరిచిన 10గ్రాముల బంగారు ఆభరణాలు, 300గ్రాముల వెండి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటన చౌదరిగూడలోని పద్మావతీ కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన పడుమటి రామిరెడ్డి ఈనెల 14వ తేదీన ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో కలిసి యాదాద్రి-భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో నిర్వహించే శుభకార్యానికి వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూసేసరికి బీరువాలో భద్రపరిచిన 15తులాల బంగారు ఆభరణాలు, రూ.4లక్షల నగదు కనిపించలేదు. దీంతో రామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 16: అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా, తుర్కపల్లికి చెందిన గూగులోతు బద్య ఘట్‌కేసర్ మున్సిపల్, బొక్కొని గూడలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లోని ఇటుకబట్టీల్లో పనిచేసే కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో మంగళవారం ఉదయం రేషన్ బియ్యాన్ని ట్రాలీ వాహనంలో తరలిస్తుండగా బద్యను అదుపులోకి తీసుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధారూరులో ఇసుక ట్రాక్టర్..

ధారూరు, ఏప్రిల్ 16: అడవిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి అటవీ అధికారులు పట్టుకున్నారు. అటవీసెక్షన్ అధికారి మొయినోద్దీన్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని రాస్నం సెక్షన్‌లోని సంగయపల్లితండా అటవీప్రాంతం నుంచి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. సంగాయపల్లి తండాకు చెందిన మిట్టునాయక్ అడవిలో నుంచి రాత్రి సమయంలో ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మిట్టునాయక్‌పై గత ఫిబ్రవరి 20న అడవిలో అక్రమంగా చెట్ల నరికివేతకు సంబంధించి కేసు నమోదైందని వెల్లడించారు. అదేవిధంగా 2019లో అతడి వద్ద నుంచి జంతువుల వేటకు ఉపయోగించే తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటి చలాన్లు కూడా ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపారు.

ఉపాధి కూలీల ఖాతాల్లో నగదు జమ

తాండూరురూరల్, ఏప్రిల్ 16: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు డబ్బులు అందాయి. మూడు నెలలుగా డబ్బులు రాక అందక కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'పెండింగ్‌లో ఉపాధి కూలి' అనేశీర్షికతో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని 33గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు 2700 మందికి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి కూలి డబ్బులను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తాండూరు మండల ఉపాధి హామీపథకం ఏపీవో నరోత్తంరెడ్డి తెలిపారు. ప్రస్తుతం తాండూరు మండలంలో ప్రతీరోజు 3900మంది ఉపాధి కూలీలు ఆయాగ్రామాల్లో చెరువు పూడికతీత పనుల్లో చెరువు కాల్వల తీత, ఫారంపాండ్స్ మట్టికట్టల నిర్మాణం, లాండ్ లెవలింగ్ వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక కూలీకి రూ.6వేల నుంచి రూ.8వేల వరకు నగదు జమ చేసినట్లు వివరించారు.

కూలీల సంఖ్య పెంచాలి

తాండూరురూరల్: గ్రామాల్లో ఉపాధికూలీల సంఖ్యను పెంచేందుకు ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేటీలు ప్రత్యేకచర్యలు చేపట్టాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే ఫీల్డ్‌అసిస్టెం ట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఒక్క రోజు 2600మంది వరకే కూలీలు పని చేస్తున్నారని, అట్టి సంఖ్యను ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంగా 6వేల మంది వరకు ఉందని, 6వేలకు కూలీల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు.



ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

వికారాబాద్, ఏప్రిల్ 16: బీజేపీ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి అన్నారు. మద్గుల్ చిట్టంపల్లిలో మంగళవారం ఇంటింటికి తిరిగి బీజేపీ నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

శామీర్‌పేట: మండల మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ మంగళవారం ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతోట పాటు అనుచర నాయకులు మాజీసర్పంచ్ పద్మ, మాజీ ఎంపీటీసీ పద్మ శివకుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పరమేశ్‌యాదవ్, వినోద్ జైన్, దీపక్ అగర్వాల్, శ్రీశైలంయాదవ్, బబులుయాదవ్, మన్నె నాగేష్‌యాదవ్, బండల వీరేశ్‌యాదవ్ తో పాటు దాదాపు 200 మంది కార్యకర్తలు నూతనంగా బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బుద్ది శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ వికారాబాద్ ఎన్నికల ఇన్‌చార్జిగా రాజునాయక్

ధారూరు: బీజేపీ వికారాబాద్ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా దోర్నాల్ తండాకు చెందిన ధారూరు పీఏసీఎస్ వైస్‌చైర్మన్ డి.రాజునాయక్‌ను నియమించారు. బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ మంగళవారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

ఆలయ భూముల వేలం

తాండూరు రూరల్, ఏప్రిల్ 16: చంద్రవంచ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఒక ఏడాది పాటు పంటలు పండించేందుకునేందుకు 33 ఎకరాలకు వేలం నిర్వహించారు. కొంతమంది రైతులు వేలంలో పాల్గొనగా నలుగురు రైతులు రూ.3లక్షల 15వేలు చెల్లించి వేలాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శేఖర్‌గౌడ్, గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కీసర:** మండలంలోని రాంపల్లి దాయర లోని జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్ విద్యార్థి ప్రతిభకు యాజమాన్యం నగదు ప్రోత్సాహకాన్ని అందజేసింది. తివేంద్రంకు చెందిన విక్రమ్ సారాభాయ్ సైన్స్ ఫౌండేషన్ ఇటీవల జూబ్లీహిల్స్ పబ్లిక్‌స్కూల్‌లో శాస్త్ర సాంకేతిక పరిశోధనకు సంబంధించి స్పాట్ అసెస్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో జూబ్లీహిల్స్ స్కూల్ 8వ తరగతికి చెందిన జోయెల్ లక్రస్పాట్ పరీక్షలో అర్హత సాధించాడు. త్వరల్లో తివేంద్రంలో జరిగే మెయిన్ పరీక్షలో చక్కటి విజయం సాధించాలని కోరుతూ మంగళవారం పాఠశాలలో జోయల్ లక్రను పాఠశాల ప్రిన్సిపల్ సుచరితరాయ్ అభినందించి రూ.10వేలు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు.

● **దోమ:** అంతరించిపోతున్న కళల పునరుద్ధరణకు తగిన ప్రోత్సాహం ఉంటుందని దోమ జడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డి అన్నారు. ఊటుపల్లిలో కొనసాగుతున్న మహా రామాయణం వీధి నాటకానికి సోమవారం రాత్రి వైస్ ఎంపీపీ మల్లేశం, దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కే.రాజీరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్‌లతో కలిసి హాజరయ్యారు. వీధి నాటకానికి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **శామీర్‌పేట:** స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మజీద్‌పూర్‌కు చెందిన కొప్పిశెట్టి వెంకట్రావు- రేణుక దంపతులు, వారి కటుంబ సభ్యులు హరిస్వరూప్- స్వరూప దంపతులు, జాహ్నవిలు అన్నదానం చేపటారు. ఈ

● **పరిగి:** మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన తెలుగు నర్సమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ సర్పంచి వెంకటేశ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం తక్షణ సహాయం కింద రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● **పరిగి:** అగ్నిమాపక కేంద్రం గురించి ప్రతి గృహిణి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిగి ఫైర్ స్టేషన్ అధికారి సేవ్యా అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని శ్రీనివాసనగర్‌కాలనీలో ఇళ్ల దగ్గరకు వెళ్లి వంటగ్యాస్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో బీజేపీ జిల్లా ఆర్‌టీఐ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. సొంత గ్రామానికి తనవంతుగా మేలు చేయాలనే ఉద్దేశంతో తన సొంత నిధులతో ప్యాచ్ వర్క్ చేయించారు. ఏజేఆర్ ఫంక్షన్ హాలు, మిల్క్ సెంటర్ దగ్గర మరమ్మతు పనులు చేయించారు. మిల్క్ సెంటర్ దగ్గర స్పీడ్ బ్రేకర్ వేయించాలని సంబంధిత అధికారులను కోరారు.

యువత సన్మార్గంలో నడవాలి



తరుణ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, ఏప్రిల్ 16 : యువత సన్మార్గంలో నడిచి ఉన్నత స్థాయికి ఎదగాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఐఏఎస్ సాధించిన పూడూరు మండలం మంచన్‌పల్లికి చెందిన తరుణ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. మంగళవారం రాత్రి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గ్రామంలోని తరుణ్ నివాసానికి వెళ్లి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు అయ్యూబ్, జిల్లా కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. అదేవిధంగా తరుణ్ తల్లిదండ్రులు బాబయ్య, శశికళల తమ కుమారుడు ఐఏఎస్ సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి తమ ఇంటి వద్ద కేక్ చేసి కుమారున్ని సన్మానించారు. తమ కుమారుడు ఐఏఎస్ సాధించడం తమకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

శామీర్‌పేట, ఏప్రిల్ 16: రాష్ట్ర కేసీఆర్ సేవాదళం కార్యదర్శి అఫ్జల్ ఖాన్ మంగళవారం తన పదవికి, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం, ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తాను ఏ పార్టీలో చేరేది త్వరలో ప్రకటిస్తానని వెల్లడించారు.

కోడ్ అమల్లో ఉన్నా తొలగని పోస్టర్లు, గోడరాతలు



గౌడవెల్లిలో గోడలపై తొలగని బీజేపీ వాల్‌పోస్టర్లు, కమలంగుర్తు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 16: ఎన్నికలకోడ్ అమలులో ఉన్నా గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, గోడరాతలను పూర్తిస్థాయిలో తొలగించలేదు. మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, గోడరాతలు దర్శనమిస్తున్నాయి. ఎక్కడికక్కడ నేతల వాల్‌పోస్టర్లు, కటౌట్‌లు, గోడలపై రాతలు పూర్తిగా తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాల్లో ఆదిశగా చర్యలు చేపట్టడంలేదు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో బీజేపీకి చెందిన వారు ఇళ్ల గోడలపై ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లు, ప్రహరీపై వేసిన కమలం గుర్తులు యథాతథంగా ఉన్నాయి. అధికారులు వాటిని పట్టించుకోక పోవటంతో ఒకరిని చూసి మరొకరు తమ పార్టీ వాల్ పోస్టర్లను ఇళ్లగోడలకు అతికించి వెళ్తున్నారు. గౌడవెల్లిలోనే కాకుండా మండలంలోని పలు గ్రామాలతో పాటు, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు కనబడుతున్నాయి.

దేవాలయానికి విరాళం

కీసరరూరల్, ఏప్రిల్ 16: నాగారం మున్సిపాలిటీ 10వవార్డు పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించనున్న శ్రీరామనవమి వేడుకలకు స్థానిక బీజేపీ నాయకుడు నరేష్ రూ.15వేలను ఆలయ కమిటీ సభ్యుడు నవీన్‌గౌడ్‌కు విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో సూర్యశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.